

నేడు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు తదితర డిమాండ్లకు మద్దతుగా ఈనెల ఎనిమిదో తేదీన విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వామ్యమై విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతు తెలపాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ తదితర సంఘాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని తెలిపారు. పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చాయి.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- టిడిపికి స్పీకర్ సీతారాం సవాల్
- ఒకే పాలనలో అనేక సంస్కరణలు
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- జిల్లా అభివృద్ధికి టిడిపి చేసిందేమిటి?
- పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - ఆమదాలవలస

'మా పాలనలో మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి' అని చెప్పే ధైర్యం ఇప్పటివరకు ఎవరూ చేయలేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే ఆ సత్తా ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా చంద్రయ్యపేట వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో సంక్షేమ కార్యక్రమాలన్నీ అవినీతి లేకుండా జరిగాయన్నారు. చంద్రబాబు, ఆయన తాబేదారులు బాగుపడితేనే అభివృద్ధి జరిగినట్లా అని ప్రశ్నించారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని టిడిపికి సవాల్ విసిరారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఒకే పాలనలో అనేక సంస్కరణలు

వైసిపి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఏనాడూ జిల్లా అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. నేరడి బ్యారేజీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒడిశాపై కేసు గెలిచినా, ఒక మెట్టు దిగి ఒడిశా వెళ్లి సిఎం నవీన్ పట్నాయక్‌ను కలిసి సహకరించాలని కోరారని గుర్తుచేశారు. ఆయన స్పందించకపోవడంతో, హిరమండలం వద్ద రూ.800 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని, ఈనెల 23న ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. ఒకే పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు అవినీతి లేకుండా భర్తీ చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని కొనియాడారు. విశాఖపట్నంను రాజధానిగా జగన్మోహన్ రెడ్డి చేస్తామంటే, చంద్రబాబు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. తన తాబేదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతి రాజధానిగా నిర్ణయించారని ఆరోపించారు. విశాఖకు రాజధాని వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. తెలుగుదేశం నాయకులకు మాట్లాడడానికి ఏవీ లేక విద్యుత్, గ్యాస్, పెట్రోల్, నిత్యావసర ధరలు పెరిగాయని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు.

ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టారు

చంద్రబాబు ప్రజల ఆత్మాభిమానాన్ని జన్మభూమి కమిటీల వద్ద తాకట్టు పెడితే, జగన్ ప్రభుత్వంలో ఇంటికే పథకాలు అందుతున్నాయని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఉద్దానం ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రీసెర్చ్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. మూలపేట పోర్టు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌కు సవాల్‌లు విసరడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు రైల్వేస్టేషన్లలో స్టీల్ కుర్చీలు వేయించడం తప్ప జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు వి.కళావతి, రెడ్డి శాంతి, కంబాల జోగులు, గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జూపూడి ప్రభాకరరావు, కార్పొరేషన్ల చైర్మన్లు పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, దానేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

షెడ్యూల్ ప్రకారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలదండలు వేసి నివాళులు అర్పించాల్సి ఉంది. స్థానిక నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద దండలు సిద్ధం చేసినా నాయకులు ఆగకుండా వెళ్లిపోవడంతో, ఇదేనా సామాజిక సాధికారిత యాత్ర అంటూ పలువురు వ్యంగంగా మాట్లాడుకున్నారు. బస్సు యాత్ర షెడ్యూల్ కంటే గంట ఆలస్యంగా ప్రారంభం కావడంతో నాడు-నేడుతో ఆధునీకరించిన మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శన రద్దయింది. సభలో ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతున్న సమయంలో మహిళలు, కార్యకర్తలు మెల్లగా జారుకున్నారు. సినీ నటి, మంత్రి రోజా వస్తుందని చెప్పడంతో వచ్చామని, తీరా చూస్తే ఆమె రాలేదని పలువురు మహిళలు చెప్పారు. సభకు రాకపోతే పథకాలను నిలిపేస్తామని బెదిరించారని సరుబుజ్జిలి మండలం బప్పడాం, అమృత లింగనగరం తదితర గ్రామాల మహిళలు తెలిపారు. వచ్చాక కనీసం తాగడానికి మంచినీళ్ల ప్యాకెట్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

అవస్థలు పడిన ప్రజలు

సాధికార యాత్ర నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి నుంచే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద, ఇటువైపు కృష్ణాపురం జంక్షన్ వద్ద రహదారికి అడ్డంగా బారికేడ్లు పెట్టడంతో పట్టణంలోకి బస్సులు, ఆటోలు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వేస్టేషన్‌కు వచ్చి, వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణం నుంచి నరసన్నపేటకు వెళ్లే బస్సులు కృష్ణాపురం జంక్షన్ నుంచి రాకపోకలు సాగించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. హిరమండలం, కొత్తూరు వెళ్లే బస్సులు ఫ్లై ఓవర్, బొడ్డేపల్లిపేట, పార్వతీశంపేట మీదుగా దారిమళ్లించడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించి ఫ్లై ఓవర్ వద్దకు చేరుకుని బస్సులు ఎక్కారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడానికి ఉదయం వెళ్లే ఉద్యోగులు బస్సులు పట్టణంలోకి రాకపోవడంతో సమాచారం తెలియక చాలాసేపు రైల్వేస్టేషన్ జంక్షన్, పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద బస్సుల కోసం వేచిచూశారు. చివరికి విషయం తెలియడంతో కొంతమంది పార్వతీశంపేట జంక్షన్, మరికొంతమంది ఫ్లైఓవర్ దగ్గరికి బస్సుల కోసం పరుగులు తీశారు. చాలామంది ప్రయాణికులు ఫ్లైఓవర్ దిగున బస్సులు దిగి రైల్వేస్టేషన్ వరకు నడుచుకొని రావడం కనిపించింది. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులు వైసిపి కార్యకర్తలను బస్సు యాత్రకు తరలించడం కోసం తీసుకోవడంతో చాలామంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక ఇంటి వద్దనే ఉండిపోయారు. పాఠశాలలు కూడా ఒక పూట మాత్రమే పనిచేశాయి. నడిరోడ్డుపై సభలు నిర్వహించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పలువురు అసహనం వ్యక్తం చేశారు.



దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

మరోసారి బట్టబయలైన గ్రూపుల గోల

సామాజిక సాధికారిక యాత్రలో వైసిపిలో గ్రూపుల గోల మరోసారి బయటపడింది. బస్సు యాత్రలో సువ్వారి గాంధీ, చింతాడ రవికుమార్, కోట గోవిందరావు గానీ వారి అనుచరగణం గానీ పాల్గొనలేదు. చింతాడ రవికుమార్ కృష్ణాపురం జంక్షన్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీల్లో స్పీకర్ సీతారాం ఫొటోను వేయకుండా సిఎం, మంత్రులు, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి సుబ్బారెడ్డి తదితరుల ఫొటోలతో ముద్రించారు. దీంతో ఆ ఫ్లెక్సీలను తొలగించారు. స్పీకర్ మౌఖిక ఆదేశాలతోనే తొలగించారని రవికుమార్ అనుచరులు ఆరోపిస్తున్నారు. ఫ్లెక్సీల తొలగింపుతో కొంతసేపు గందరగోళ పరిస్థితులు పట్టణంలో నెలకొన్నాయి.

గ్రామ సచివాలయాల్లో ప్రగతి బోర్డులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ సచివాలయాల వారీగా ప్రగతి బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. జిల్లా అధికారులు, సచివాలయాల సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జిఒ నంబరు 7పై మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ, గ్రామానికి ప్రభుత్వం చేసిన మేలు గుర్తు చేసుకునేలా బోర్డులను రూపొందించాలన్నారు. ప్రతి మండలంలోని ఒక సచివాలయాన్ని ఎంపిక చేసి ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమావేశం నిర్వహించే తేదీని ముందుగా తెలియజేయాలన్నారు. ఆరోగ్య సురక్ష, గడప గడపకుకు మన ప్రభుత్వం కార్యక్రమంలానే షెడ్యూల్‌ను అనుసరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

గ్రామాల వారీగా ప్రత్యక్ష నగదు బదిలీ ఎంత మేరకు అందింది, ఎంతమంది లబ్ధి పొందారన్న అంశాలను బోర్డుల్లో పొందుపరచాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ 9వ తేదీ నుంచి వై ఎపి నీడ్స్ జగన్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లాపరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

- 10న రైతుగర్జన, బిసి సభ
- డిసిసి అధ్యక్షులు పరమేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కరువు పరిస్థితులతో అల్లాడుతున్న శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతితో కలిసి మాట్లాడారు. ఒడిశాలో కురిసిన వర్షాల వల్ల వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదుల్లో పుష్కలంగా నీరున్నా, జిల్లాలో రైతాంగానికి సాగునీరందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వంశధార కుడి కాలువలో గడిచిన ఐదేళ్లుగా పూడికతీత పనులు చేపట్టలేదని, కాలువకు ఇరువైపులా 12 ఏళ్లుగా షట్టర్లు లేకపోవడం వల్ల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతుందని తెలిపారు. వర్షాభావంతో రైతులు అల్లాడిపోతుంటే జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కరువు మండలాల గణనలో, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంలో జిల్లాకు చెందిన మంత్రులు, అధికారులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఈనెల పదో తేదీన రైతు గర్జన, బిసి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, సిడబ్ల్యుసి వర్కింగ్ కమిటీ సభ్యులు కొప్పుల రాజు, ఎన్.రఘువీరారెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని రైతులు, బిసిలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, అంబటి కృష్ణారావు, పైడి నాగభూషణరావు, మధుసూదనరావు, డి.గోవింద మల్లిబాబు, రెల్ల సురేష్, తెంబూరు మధుసూదనరావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరమేశ్వరరావు

పెద్దపులి అలజడి

పలాస : ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు పెద్దపులి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల్లో సంచరించిన పెద్దపులి తాజాగా పలాస మండలంలోని అమలకుడియా, వీరభద్రాపురంలో తిరుగుతోంది. ఆ గ్రామాల్లోని పంట పొలాల్లో పెద్దపులి పాదముద్రలు రైతులకు కనిపించడంతో అలజడి రేగింది. రైతులు తమ పంట పొలాలు చూసేందుకు వెళ్తుండగా పాదముద్రలు కనిపించడంతో, సర్పంచ్ ప్రతినిధి కొర్ల మురళీకృష్ణ చౌదరి తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు దృష్టికి తీసుకెళ్లారు. అటవీశాఖ అధికారులు పంట పొలాల్లో ఉన్న పాదముద్రలు అనుసరించి వెళ్లి పరిశీలించగా, అమలకుడియా పంట పొలాల నుంచి సమీపంలో ఉన్న పూర్ణభద్ర గెడ్డలో దిగి గట్టు ఎక్కినట్లు ఉన్నాయి. పాదముద్రల ఆధారంగా వీరభద్రాపురం కొండ వైపు వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. దీంతో పూర్ణభద్ర, అమలకుడియా, వీరభద్రాపురం, అమలకుడియా కాలనీ ప్రాంతాల ప్రజలను అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేశారు.

బేటీ బచావో, బేటీ పఢావోపై అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంపై జిల్లా కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షిని ఆదేశించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ సమయంలో ఆడ, మగ వ్యత్యాసాన్ని నిర్ధారించకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. సెక్స్‌రేషియాతో పాటు మాతృ మరణాలు తగ్గించడంపై ప్రత్యే శ్రద్ధ చూపాలని చెప్పారు. జిల్లా నుంచి ఐఎఎస్‌కు ఎంపికైన మహిళా అధికారులు, కరణం మల్లీశ్వరి వంటి మహిళలతో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో మహిళలే సభ్యులుగా ఉన్న గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మాలో సఖి గ్రూపులను చైతన్యపరచాలన్నారు. మహిళల్లో అవగాహన కల్పిచడానికి విజయనగరం జిల్లా కలెక్టర్, ఎస్‌పి వంటి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారి అనుభవాలను తెలియజెప్పేందుకు ఆహ్వానించి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు, పిల్లలు డ్రాప్స్ లేకుండా వారిలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న వీడియోలు తీసి విడుదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకో శాఖ చొప్పున ఒక కార్యక్రమం చేపట్టి 15 రోజుల వరకు కొనసాగించి, చివరలో ఒక పెద్ద కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐదు రోజుల్లో ఆయా శాఖలు ప్రణాళికలను ఐసిడిఎస్ పీడీకి పంపాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్‌పి జె.తిప్పేస్వామి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, బాలల రక్షణ అధికారి కె.వి రమణ, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు, ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఎల్‌డిఎం సూర్యకిరణ్, వికలాంగుల శాఖ ఎడి కవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రైతు బాగుంటేనే రాష్ట్ర ప్రగతి

- అన్నదాతలకు అండగా ప్రభుత్వం
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- రైతుల ఖాతాలకు రూ.132.41 కోట్ల రైతుభరోసా జమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతులు బాగుంటేనే రాష్ట్ర ప్రగతి బాగుంటుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో పిఎం కిసాన్-రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. అందుకే జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దఎత్తున సహకారాన్ని అందిస్తోందని తెలిపారు. దేశంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో రాయితీ ఇచ్చింది రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పెట్టుబడి కింద ఐదేళ్లుగా రైతులకు రైతుభరోసా అందించి ఆదుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,21,854 మంది రైతులు, కౌలు రైతులు, అటవీభూముల సాగుదారులకు 2023-24 సంవత్సరానికి రెండో విడత సాయంగా రూ.132.41 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేసినట్లు తెలిపారు. రైతుల కోసం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, రైతు కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఆధునిక పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు రైతు పండించే పంట కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. భూ రీ సర్వే చేసి ప్రతి ఒక్కరికీ భూ హక్కు కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో నీరు అందించాలనే లక్ష్యంతో వంశధార, నాగావళి అనుసంధానం చేయడానికి చర్యలు చేపట్టి ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు నేతాజి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, అగ్రి మిషన్ సభ్యులు గొండు రఘురాం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా ఉద్యాన అధికారి వరప్రసాద్, ఎల్‌డిఎం సూర్యప్రకాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

రాత్రివేళలో పకడ్బందీగా గస్తీ

- ప్రతి బీట్ పాయింట్ క్షుణంగా తనిఖీ చేయాలి
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాత్రివేళలో పకడ్బందీగా గస్తీ నిర్వహించడంతో పాటు ప్రతి బీట్ పాయింట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక బీట్ తనిఖీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి సోమవారం అర్ధరాత్రి శ్రీకాకుళం నగరంలో గస్తీ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాత్రి గస్తీ విధుల్లో భాగంగా నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ, అనుమానిత వ్యక్తులను ప్రశ్నించాలన్నారు. ఎటిఎంలు, బ్యాంకులను తరచుగా తనిఖీ చేస్తూ సెక్యూరిటీని అప్రమత్తం చేస్తూ ఉండాలని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారకు ఎక్కువగా లాడ్జీల్లో ఉండే అవకాశం ఉన్నందున వాటిని తనిఖీ చేయాలన్నారు. కొత్త వ్యక్తులు, అపరిచితుల ఆధార్, వ్యక్తిగత గుర్తింపుకార్డులను పరిశీలించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల వద్ద అపరిచిత వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి పాయింట్ బుక్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాజాభివృద్ధికి ప్రతిఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రముఖ శాస్త్రవేత్తలు సర్ సి.వి రామన్, మేరీ క్యూరీ జయంతిని పురస్కరించుకుని ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన శాస్త్ర ప్రచార ఉద్యమంలో భాగంగా సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌ను మంగళవారం ప్రారంభించారు. ముందుగా సి.వి రామన్, మేరీ క్యూరీ చిత్రపటాలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణతో కలసి పూలమాలలు నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌ను ఈనెల ఏడో తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెవివి నాయకులు సిహెచ్.ఉమామహేశ్వర్ అశాస్త్రీయ భావనలను పోగొట్టే మ్యాజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా సీనియర్ నాయకులు కొత్తకోట అప్పారావు, జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, కళాశాల ఫిజిక్స్, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జీలు టి.స్వర్ణలత, పి.సూర్య సునీత, జెవివి జిల్లా నాయకులు ఎం.వాగ్దేవి, పి.కూర్మారావు, వి.ఎస్ కుమార్, గరిమెళ్ల అధ్యయన కేంద్రం కన్వీనర్ వి.జి.కె మూర్తి, అధ్యాపకులు పద్మావతి, సిహెచ్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిధర్

త్వరితగతిన పునరావాస కాలనీ పనులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మూలపేట పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు నిర్మించ తలపెట్టిన పునరావాస కాలనీల్లో త్వరితగతిన పనులు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. మూలపేట పునరావాస కాలనీల్లో రహదారులు, కాలువలు, తాగునీరు సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో అంతర్గత సిసి రహదారులు, కాలువలు త్వరితగతిన నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. పనులకు సంబంధించి నిధులు ఇప్పటికే మంజూరు చేసినట్లు వివరించారు. టెక్కలి సమీపాన గల తేలినీలాపురం నుంచి తాగునీరు పైపులైన్ల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ సత్యనారాయణమూర్తి, సర్వేశాఖ ఎడి విజయ్ కుమార్, డిఇ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, రామ్మూర్తి, ఎఇలు పాల్గొన్నారు.



కబడ్డీని తిలకిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- రణస్థలం

క్రీడలతో మానసికోల్లాసం ఉంటుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం (గ్రిగ్స్) మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని, విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. క్రీడల్లో రాణించిన వారికి అదనపు అర్హత, ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు త్రినాథరావు, లావణ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, పంచాయతీ సర్పంచ్ బవిరి రమణ, జె.ఆర్.పురం ఎంపిటిసి-1 ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాం, కొండములగాం ఎంపిటిసి రెడ్డి వాసు, రణస్థలం మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ టేకి బ్రహ్మజీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.రమణయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని జిల్లా క్రీడాకారులకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. ఈ నెల 4, 5, 6వ తేదీల్లో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన 67వ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ పోటీల్లో విజయాలు సాధించిన జిల్లా క్రీడాకారులను సమావేశ మందిరంలో మంగళవారం అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరిచి రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఇఒ వెంకటేశ్వరరావు, అదనపు ఎస్‌పి జె.తిప్పేస్వామి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, బాల్ బ్యాడ్మింటన్ సంఘం సహాయ కార్యదర్శి, శిక్షకుడు ఎం.మధుసూదనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి మల్లేష్, బి.హెచ్.మాధురి పాల్గొన్నారు.

వృథా యాత్ర : జనసేన

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి ప్రభుత్వం పట్టణంలో చేపడుతున్న ప్రజా సాధికారిత బస్సు యాత్రపై జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి సామాజిక సాధికారిక బస్సు యాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనలతో ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. నేతలు వారి స్వార్థానికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఈ యాత్రలను చేపడుతున్నారని విమర్శించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం పట్టణంలోని ప్రధాన రహదారిని దిగ్బంధం చేసి రాకపోకలను నిలిపివేసి ప్రజలను నానా ఇబ్బందులు గురి చేశారని ఇది తగదని అన్నారు.

నత్తనడకన భవన నిర్మాణాలు



కోటబొమ్మాళిలో పూర్తి కాని సచివాలయ నిర్మాణం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను అనుబంధంగా ఆర్‌బికెలను ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బికె, ఆరోగ్య కేంద్రం, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాలు జరగాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో పలు గ్రామాల్లో ఆయా భవనాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అయితే పలు కారణాల వల్ల వాటిలో చాలావరకు అసంపూర్తిగానే ఉన్నాయి. వీటి సంగతి అలా ఉంచితే గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభమై అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం పూర్తిగా అటకెక్కేసింది. నిధుల కొరత లేదని, భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని ఓ వైపు అధికారులు చెబుతుండగా, ఆగి ఉన్న భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తే తామెందుకు పూర్తి చేయమని కాంట్రాక్టర్లు అంటుండడం గమనార్హం.

నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి, వైద్యశాలలకు ముమ్మరంగా నిధులు కేటాయించడం ద్వారా వైద్య రంగంలో పలు ఆశాజనకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా సిఎం మానస పుత్రికగా భావించే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు గ్రామాల్లో పరిపాలనను ప్రజల ముంగిటకే తీసుకుపోయిందనడంలో సందేహం లేదు. ఈ వ్యవస్థలకు సంబంధించి గ్రామంలో సచివాలయ, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, తదితర భవనాలను కూడా నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. హుటాహుటిన స్థలం అందుబాటులో ఉన్న ప్రతి గ్రామంలోనూ ఈ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల పూర్తయి ప్రారంభోత్సవాలకు నోచుకున్నాయి. మరికొన్ని చోట్ల అర్థాంతరంగా నిర్మాణం ఆగిపోయి అసంపూర్తిగా ఉన్నాయి.

నిత్యం జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై సమీక్షలు చేస్తూనే ఉంది. లక్ష్యాలను పూర్తి చేయాలని త్వరితగతిన సచివాలయాలు, ఆర్‌బికెలు తదితర భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే ఆయా భవనాల నిర్మాణం మూడడుగులు ముందుకు, నాలుగడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది. ఓ వైపు నిధుల కొరత లేదంటున్న అధికారులు భవనాల నిర్మాణం ఎందుకు ఆలస్యమవుతుందో చెప్పడం లేదు. కాగా, భవనాల నిర్మాణం చేపట్టిన ద్వితీయ శ్రేణి నాయకులు, కాంట్రాక్టర్లు బిల్లులు సక్రమంగా కాకపోవడంతో నిర్మాణాలను ఆపివేశారు. నిధులు వెంటనే విడుదల చేస్తే తామెందుకు పూర్తి చేయమని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఏకతాటిపై వచ్చి ఈ భవన నిర్మాణాలు పూర్తి చేసి కార్యాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రం

రంగంలోకి మా'స్టార్'

టెక్కలి : జిల్లా ప్రజలకు బహుముఖ రంగాల్లో పరిచయ ఉన్న డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఉపాధ్యాయ సంఘ నేతగా ఆ వర్గాలకు ముందుగా పరిచయమైన పేడాడ 89- 94 సంవత్సరాల మధ్య చేపట్టిన నౌపడ రైలు ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని సైతం కదిలించింది. ఉద్యమం ఫలితంగా నౌపడలో మెయిల్‌తో సహ అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ దొరికింది. ఎపిసి, ఎల్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలగోపాల్ పనిచేసిన కాలంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షునిగా పేడాడ వార్తల్లోకి ఎక్కారు. ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామ చేసి తర్వాత జర్నలిస్టుగా స్థిరపడ్డారు. ఉమ్మడి ఆంధ్రాలో 8 ఏళ్ల కాలం ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. రచయితగా పక్షి నాటికకు జాతీయ బహుమతి అందుకున్న పేడాడ ఆంధ్రా విశ్వవిద్యాలయం ద్వారా తెలుగులో డాక్టరేట్ పొందారు. నౌపడ వద్ద పలు విద్యాసంస్థలు స్థాపించి ఈ ప్రాంత ప్రజలకు చేరువయ్యారు. 2008లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపనలో భాగంగా జిల్లాలో కీలకంగా వ్యవహరించిన పేడాడ 2010లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన రెండుసార్లు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో ఘోరంగా వైఫల్యం చెందింది. ఫలితంగా పార్టీలో మిగిలి ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు, క్యాడర్ ప్రముఖ పార్టీల పంచన ప్రస్తుతం సేదతీరుతున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకత్వ పగ్గాలు చేపట్టిన మాస్టార్ ముందు పూర్తి చేయాల్సిన సిలబస్ చాలా ఎక్కువ ఉందని చెప్పవచ్చు. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఆయనకు ముళ్లకిరీటం తగిలించి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పెద్ద టాస్క్ ఇచ్చిందనే చెప్పవచ్చు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ఏర్పాటుతో పాటు జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలను సామాజిక వర్గాల ప్రకారం చక్కదిద్దాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.

ప్రకాష్‌కు పురస్కారం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పారిశ్రామిక వేత్త, చిత్ర నిర్మాత, సామజిక సేవకులు డాక్టర్ బలగ ప్రకాష్‌కు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఛాంపియన్స్ అఫ్ చేంజ్ పురస్కారం అందజేసింది. కర్ణాటక గవర్నర్ తవర్ చంద్ గేహ్లాట్ చేతులమీదుగా మంగళవారం ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భారతరత్న పి.ఎన్.రావు, మాజీ సిఎం ఎస్.ఎం.కృష్ణ, భారత క్రికెట్ జట్టు మాజీ ఫాస్టు బౌలర్ వెంకటేష్‌ప్రసాద్, పద్మవిభూషణ్ వీరేంద్ర హెగ్డే, పద్మశ్రీ తులసీగౌడ పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సేవలకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని ప్రకాష్ తెలిపారు.



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రకాష్

గంటి రాజేశ్వరరావు అమరజీవి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి- సోంపేట

కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు అమరజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బారువలో సిఐటియు నాయకులు దుంపల కృష్ణారావు మస్తారు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు 71 వర్థంతి సభలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీవాన్ కుటుంబంలో పుట్టినా అట్టడుగు జనాలకి, పీడిత జనుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బిజెపి ప్రభుత్వం దేశం మతాల మధ్య చిచ్చు పెడుతూ మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. దేశ సంపదను అంతా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కును అమ్మడానికి అదేమైనా మోడీ తాత సొత్తు అని ప్రశ్నించారు. సంగారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గంటి రాజేశ్వరరావు ఏ లక్ష్యం కోసం పోరాటం చేశారో, ఆ లక్ష సాధన కోసం మనమంతా పోరాటం చేయాల్సి ఉందని అన్నారు. విద్యుత్ ప్రయివేటుపరం చేయాలని పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీనియర్ కామ్రేడ్ పాతని కృష్ణమూర్తి వర్తమాన రాజకీయాలను గురించి వివరించడమే కాకుండా రాజకీయాల్లో యువత పాత్రపై వివరించారు. అంతకుముందు కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం జానపద, విప్లవ గేయాల నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో భ వన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సురేష్, మేస్త్రి చిరంజీవి, గంటి రాజేశ్వరరావు అభిమానులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమూర్తి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్‌నాయక్

పక్కాగా రీ సర్వే

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే పక్కాగా నిర్వహించాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ సూచించారు. కవిటి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మండలంలో నిర్వహించిన రీ సర్వే వివరాలు, రికార్డులు పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితా పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.శేఖర్, డిప్యూటీ తహశీల్దార్ టి.రామచంద్రరావు, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున పనిగ్రాహి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనందరావు

అంగన్వాడీలపై దాడి అమానుషం

ప్రజాశక్తి- పలాస

బీహార్ రాష్ట్రంలో న్యాయమైన తమ కోర్కెలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఆందోళన చేస్తున్నారని, వారిపై పోలీసులు దాడి చేయడం అమానుషమని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు బి.ఆనందరావు, బి.వాసుదేవరావు, బి.ఓంకార్, వంకల అప్పయ్య, ఎన్.మోహనరావు అన్నారు. కాశీబుగ్గలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మహిళలపై లాఠీ ఛార్జి చేసి, వాటర్ ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయపరమైన డిమాండ్లను పరిశీలించాలన్నారు. అనంతరం వారి పోరాటానికి మద్దతుగా సంఘీభావం ప్రకటించారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

కొత్తూరు : జిల్లా అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేసిన వంశధార నిర్వాసితులకు న్యాయం చేయాలని పాతపట్నం నియోజకవర్గ నాయకులు, విద్యావేత్త సిరిపురపు తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు కొత్తూరు, కర్లెమ్మ, పాడలి ఆర్అండ్ఆర్ కాలనీ, మహసింగ్‌గూడ గ్రామాల్లో మంగళవారం ప్రజా సంకల్పయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార నిర్వాసితులు దయనీయస్థితిలో ఉన్నారని, వారికి భరోసానిచ్చే నాయకులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ, వలస నాయకులకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో దశాబ్దాలుగా అభివృద్ధిలో వెనుకకు నెట్టారని అన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తేజేశ్వరరావు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

టెక్కలి రూరల్: చట్ట వ్యతిరేక, అనైతిక చర్యలకు పాల్పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యాన మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో, అకుంటిత దీక్షతో ప్రణాళికాబద్ధంగా చదివిన జీవితంలో మంచి స్థాయిల్లో స్థిరపడాలన్నారు. ఉన్నత ఆశయాలు కలిగిన మహాత్ముల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం, ఎన్ఎస్ఎస్ విభాగాల కో-ఆర్డినేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

'మా నమ్మకం నువ్వే జగనన్న'పై సమీక్ష

ఇచ్ఛాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఈశ్వరరావు అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై కార్యదర్శులతో మంగళవారం సమీక్షించారు. ఈ మేరకు కార్యదర్శులకు కార్యక్రమం విజయవంతంపై దిశ నిర్ధేశం చేశారు. అనంతరం కార్యాలయానికి సంబంధించిన పాత వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో అత్యధికంగా రూ.84 వేలుకు కోడ్ చేసిన దక్కత రామారావుకు వాహనాలను అప్పగించారు. ఈ పాటలో ముగ్గురు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఎఒ రామారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

'విశ్వశాంతి' విద్యార్థుల ప్రతిభ

పోలాకి: మండలంలోని కోడూరు హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి గ్రీక్స్ పోటీల్లో పోలాకిలోని విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించి ప్రతిభ కనపరిచారని పాఠశాల డైరెక్టర్ ఎం.జనార్ధనరావు తెలిపారు. కబడ్డీ పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



బహుమతులను అందజేస్తున్న జనార్ధనరావు

ఎచ్చెర్ల టిడిపి టిక్కెట్ నాదే

- కలిశెట్టి అప్పలనాయుడు
- ఘనంగా జన్మదిన వేడుకలు



కేక్‌ను తినిపిస్తున్న శివాజీ

ప్రజాశక్తి- రణస్థలం

రానున్న శాసనసభ ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజక తెలుగుదేశం పార్టీ టిక్కెట్ నాదేనని, మాజీ సిఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ ఆశీస్సులు సంపూర్ణంగా ఉన్నాయని, నియోజకవర్గంలో గెలుపు తధ్యమని టిడిపి ఉత్తరాంధ్ర శిక్షణా శిబిరం మాజీ డైరెక్టర్, టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ధీమా వ్యక్తం చేశారు. రణస్థలంలో మంఘవారం కలిశెట్టి అప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి, జనసేన నాయకులు, అభిమానులు మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముందుగా భారీ నిర్వహించి ఎన్‌టిఆర్, కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో తాను రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజా సేవతోనే తన ప్రయాణం అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో సమస్యలపై పూర్తిగా అధ్యయనం చేశారని అన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజల తరపున పోరాటం చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ, త్రిమూర్తిరాజు, బాలబొమ్మన వెంకటేశ్వరరావు, దబ్బాడ ఆదినారాయణ, బాలి శ్రీనివాసరావు, డాక్టర్ రామారావు, జనసేన నాయకులు బాడాన జనార్ధనరావు, శ్రీనివాసరావు, రామారావు, చిరంజీవి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్ : స్కూళ్లలోను, గ్రామాల్లోను, వార్డుల్లోను దృష్టి లోపంతో బాధపడేవారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని, కంటిని పరిరక్షించుకునేందుకు ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ దినేష్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ వి.దినేష్‌కాంత్ అన్నారు. నగరంలో ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని డాక్టర్ వి.దినేష్‌కాంత్ కంటి ఆస్పత్రిలో నగరంలోని ఆటో డ్రైవర్లకు మంగళ వారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధత్వ నివారణకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంధత్వ నివారణకు రెడ్‌క్రాస్ సంస్థ సహకారాన్ని అందిస్తోందని సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. శ్రీవేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైద్యులు కె.సుధీర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో శ్రీవేవ్ ఫౌండేషన్ నిరంతరం నిమగ్నమై పనిచేస్తుందని అన్నారు. కంటి, రెటినా శస్త్ర చికిత్సకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.



నేత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ దినేష్‌కాంత్

తెలగలను బిసిలో చేర్చే వరకు పోరాటం



మాట్లాడుతున్న వెంకట రామారావు

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలోని ఉన్న తెలగలను బిసిల్లో చేర్చే వరకు పోరాడుతామని ఉత్తరాంధ్ర తెలత సంఘం నాయకులు పల్లంట్ల వెంకటరామారావు తెలిపారు. స్థానిక చంద్రశేఖర్‌స్వామి కళ్యాణ మండలంలోని లావేరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన తెలగల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ సాధన కోసం పివిఆర్ ధ్వర్యాన త్వరలో ఇచ్ఛాపురం నుంచి పాయకారావుపేట వరకు పాదయాత్ర చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో తెలగలు చాలా మంది అత్యంత దుర్భర పరిస్థితిలో కొట్టుమిత్తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యలో రిజర్వేషన్లు లేక తరతరాలుగా తెలగ విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. రిజర్వేషన్ సాధనకు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు ముప్పిడి సురేష్, యినపకుర్తి తోటయ్యదొర, పైడి శ్రీనివాసరావు, రొక్కం బాలకృష్ణ, దేశెట్టి తిరుపతిరావు, లంకలపల్లి గోపి, ఎస.ఉమా మహేశ్వరి, లంకలపల్లి శ్రీను, ఎం.శ్రీనివాసరావు, లంకలపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



పొందూరు : పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

'టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్'

ప్రజాశక్తి- పొందూరు

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని గోరింట, రాపాక గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహర్‌రెడ్డి రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశారన్నారు. ఆంధ్రాభివృద్ధిని పక్క రాష్ట్రం నాయకులు అవహేళన చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నియోజకవర్గం బిసిసెల్ అధ్యక్షులు, సర్పంచ్ ప్రతినిధి చింతాడ కృష్ణవాసుదేవరావు, టిడిపి మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, టిడిపి నాయకులు చౌదరి వరదరాజులు, కూన పాపారావు, కూన నరసింహమూర్తి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, పైడి వాసు, కొంచాడ సన్యాసిరావు, కొంచాడ మనోహరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : కోటబొమ్మాళిల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోమయిన గోవిందరాజులు, మండలంలోని సరియాపల్లిలో ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ, చీపుర్లపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, హనుమంతు అప్పలరాజు, కోరాడ పెద్ద గోవింద బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం పంచాయతీలో టిడిపి మేనిఫెస్టోపై మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, సీనియర్ నాయకులు రెడ్డి అప్పన్న, కర్రి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే మన అందరి లక్ష్యం కావాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష అన్నారు. మండలంలోని చిన్న మురహరిపురంలో సర్పంచ్ గొరకల వసంతస్వామి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో వెంకన్న చౌదరి, వజ్జ బాబూరావు, మండల టిడిపి అధ్యక్షులు సురాడ మోహనరావు, గొరకల్ వసంత స్వామి, పుచ్చ ఈశ్వరరావు, దువ్వాడ హేమబాబు చౌదరి, లోడగల కామేశ్వరరావు, గోవింద పాపారావు, కర్నీ రమణ, అఖిల్ పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : పోస్టర్ అందజేస్తున్న గౌతు శిరీష

ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టాలి

ప్రజాశక్తి- టెక్కలి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విడుదల చేసిన ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బగాది శేషగిరి కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సబ్ కలెక్టర్ నూరల్ కమర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ టెక్కలి మండలం నర్సంగాపల్లికి చెందిన సుమారు 20 ఓట్లు కోటబొమ్మాళి మండలం నర్సంగాపల్లిలో చేరాయని, వాటిని సవరించాలని కోరారు. ముఖలింగాపురం పంచాయతీకి చెందిన సుమారు 89 ఓట్లు నరసింగపల్లి బూతులో చేరాలని, వాటినీ మార్చి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్, వైసిపి మండలశాఖ అధ్యక్షులు బగాది హరి, పెద్దరట్టి మనీ, షణ్ముఖరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్


కేసరిపడ ఉలిక్కిపాటు

- ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య తగాదాలు
- తమ్ముడిని హత్య చేసిన అన్నలు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని కేసరిపడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆస్తి పంపకాల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన మనస్పర్థలు, తీవ్ర ఘర్షణలకు దారితీసి చివరికి తమ్ముడిని అన్నలిద్దరూ కలిసి నరికి చంపిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బద్రి వెంకటస్వామికి వాసు, కూర్మారావు, ఖేత్రోలు ముగ్గురు సంతానం. చిన్నవాడు ఖేత్రో చదువులో చురుగ్గా ఉండడంతో అందరూ కలిసి చదివించారు. దీంతో ఖేత్రో (32) మర్చంట్ నావిలో ఉద్యోగం సంపాదించారు. ఇతడికి ఒడిశా రాష్ట్రం జయంతిపురానికి చెందిన శిరీషతో 2022 ఫిబ్రవరిలో వివాహం చేశారు. ఈయనకు మూడు రోజుల క్రితమే బాబు జన్మించాడు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్రం బరంపురం ఆస్పత్రిలో ఉన్నారు. వీరికి ఐదెకరాల ఆస్తి ఉన్నా... కుటుంబాలు వేర్వేరుగా ఉంటున్నాయి. ఇంతలో ఖేత్రో ఉద్యోగం వచ్చిన తరువాత ఇంటి వ్యవహారాలు పట్టించుకోకపోవడంతో తండ్రి, అన్నలు ప్రశ్నించారు. కొద్ది నెలలుగా ఖేత్రో ఆస్తి పంపకాల విషయంలో అన్నదమ్ములతో తరచూ గొడవలు పడుతూ ఉండేవాడు.

ఈ క్రమంలో వారి మధ్య రాజీ కుదిరించేందుకు పెద్దలు ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశారు. గతంలో అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో ఖేత్రో తన అన్న వాసుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆ సంఘటనపై కేసు సైతం నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఇటీవల గ్రామపెద్దలు పంచాయితీ పెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చిత్రం వీధి పక్కనే ఉన్న కాళ్లసాగరం చెరువుకు ఖేత్రో బహిర్భూమి కోసం వెళ్లాడు. ఇది గమనించిన అతడి అన్నలు వాసు, కూర్మారావులు అక్కడికి వెళ్లి ఖేత్రోతో ఘర్షణ పడ్డారు. అనంతరం కోపోద్రిక్తులై కత్తులతో దాడి చేశారు. అతడి శరీరం నుంచి ఎడమ కాలును వేరు చేయడంతో అధిక రక్తస్రావం కావడంతో మృతి చెందారు. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సోంపేట సిఐ రవిప్రసాద్, కంచిలి ఎస్ఐ బాలరాజు, కాశీబుగ్గ న్యూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాశీబుగ్గ డిఎస్‌పి రామిరెడ్డి గ్రామానికి చేరుకొని హత్యపై ఆరా తీశారు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం
(ఇన్‌సెట్‌లో ఖేత్రో ఫైల్)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రేపు 'వై ఎపి నీడ్ జగన్'

ప్రజాశక్తి- రణస్థలం

ఈ నెల 9న ఎపి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని వికేంద్రీకరణ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, పోర్టులు, పరిశ్రమలు, ఐటి రంగం, నాడు-నేడులో భాగంగా స్కూళ్ల అభివృద్ధి, జగనన్న ఆరోగ్య సురక్ష, సంక్షేమ పథకాలు కొనసాగి, సంపూర్ణంగా అభివృద్ధి కావాలంటే మళ్లీ జగనన్నే సిఎం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి, లావేరు, జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధిలు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసిలు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు పాల్గొన్నారు.

నందిగాం : ఈ నెల 9న నిర్వహించనున్న ఎపికి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి సూచించాఉ. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శివప్రసాద్ ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. సమావేశం ఇఒపిఆర్‌డి రాజారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి అంబోడి విష్ణు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్ఐ

మూడు షాపులకు అనుమతులు

ప్రజాశక్తి- నరసన్నపేట

ఈ నెల 12న జరగబోయే దీపావళి పండగకు నరసన్నపేట కేంద్రంలో మూడు షాపులకు అనుమతులు వచ్చినట్లు తహశీల్దార్ ఎ.సింహాచలం తెలిపారు. ఎస్ఐ సింహాచలంతో కలిసి దుకాణాలు పెట్టిన స్థలాలను మంగళవారం పరిశీలించారు. ఈ షాపులు కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న రహదారిపై ఒకటి, రెండు, మూడు గా విభజించ షాపులకి చీట్లు వేసి లాటరీ తీస్తామని అన్నారు. ఈ మూడు నంబర్లకు ఎవరికి ఏ నంబరు వస్తే వాళ్లు ఒకటి రెండు మూడుగా నిర్ణయించుకుని షాపులు పెట్టుకోవాలని తెలిపారు. అలాగే షాపులు నిర్వాహణలో ప్రజలకు ఇంబందుల లేకుండా, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

ప్రజలను మభ్యపెట్టేందుకే యాత్రలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజలను మభ్య పెట్టేందుకే బస్సు యాత్రను నిర్వహిస్తున్నారని టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి సామాజిక న్యాయానికి గొంతు కోసి బస్సు యాత్ర చేయడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ తరగతులను మోసం చేసిన ఘనత వైసిపి పార్టీకే చెందిందన్నారు. నవరత్నాలు అంటూ నవ మోసాలు చేస్తున్నారని మండిపడ్డారు. మండలంలో 2,500 ఎకరాలకు సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే కనీసం పట్టించుకున్న నాథుడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, బోర గోవిందరావు, తమ్మినేని అమర్నాథ్, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, తంగి గురయ్య, బి.వి. రమణమూర్తి, నాగళ్ల మురళీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

గ్రీన్ స్కూల్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రీన్ స్కూల్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు పిలుపునిచ్చారు. నగరంలోని గుజరాతిపేటలో ఉన్న వరం మున్సిపల్ హైస్కూల్‌లో సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ స్కూల్ ప్రోగ్రాంలో ఈ నెల 18 లోగా ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలన్నారు. అందులో పొందుపరిచిన 16 పేజీల్లో స్కూల్ వివరాలు, ఫొటోలతో సహా అప్‌లోడ్ చేయాలన్నారు. జిఎస్‌పి పోర్టరల్‌లో గాలి, నీరు, నేల, శక్తి, చెత్త నిర్వహణ వంటి అంశాలపై పూర్తి వివరాలు నింపాలని వివరించారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎర్ర చెరువును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బెల్లుపడా కాలనీ వద్ద ఎర్ర చెరువు నిర్లక్ష్యపు నీడిలో కొట్టుమిట్టాడుతోందని, వెంటనే శుభ్రం చేయాలని దళిత కుల పోరాట సమితికి నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను మంగళవారం వినతిపత్రం అందజేశారు. రెండు, మూడేళ్లుగా పాకులతో నిండిపోయి, విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుందని అన్నారు. దోమలు, విష పురుగులు చేరడంతో జ్వరాల బారిన పడుతున్నామని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఎం.పాల్, సంతోష్‌కుమార్, రాజు, సింహాచలం, దేవకుమార్, సిహెచ్.రాజు, విజయ్ కుమార్ ఉన్నారు.

వ్యవసాయ సంక్షోభానికి పాలకులే కారణం

ప్రజాశక్తి- పలాస

వ్యవసాయ రంగం సంక్షోభానికి పాలకులే కారణమని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో అఖిల భారత రైతుకూలీ సంఘం (ఎఐకెఎమ్ఎస్) జిల్లా 10వ మహాసభ మంగళవారం నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్థూపం నుంచి మర్రిపాడు, మామిడిపల్లి, బొడ్డపాడు గ్రామాల్లో అఖిలభారత రైతుకూలీ సంఘం కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యానికి పాలకుల చిన్న చూపు ఉందని అన్నారు. వ్యవసాయాన్ని అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి మోడీ సర్కార్ పూనుకుంటుందని అన్నారు. పాలకులకు ముందు చూపు లేక ప్రాజెక్టులు నిర్మించడం లేదని అన్నారు. మాధవరావు మాట్లాడుతూ ఆదివాసీలకు పది ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఐటిడిఎను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు అఖిల భారత రైతు కూలీ సంఘం వెలగాడి కృష్ణ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మామిడి భీమారావు, భైరి కూర్మారావు, వీరస్వామి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, అరుణోదయ నాయకులు శ్రీను, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి. దానేష్, అఖిలభారత కిసాన్ మహాసభ మద్దిల రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏం చేశారు?

తెలుగు శక్తి అధ్యక్షుడు రామ్

ప్రజాశక్తి- పలాస

ఉత్తరాంధ్ర అభివృద్ధికి మంత్రులు ఏం చేశారో తెలుగు శక్తితో బహిరంగ చర్చకు రావాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ సవాల్ విసిరారు. పలాసలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు గుడివాడ అమర్ ఉత్తరాంధ్రలోని మంత్రలందరు చేతకాని వారని, కేవలం వై.ఎస్.జగన్మోహనరెడ్డి భజన చేయడమే మంత్రుల ప్రధాన బాధ్యతగా మారిపోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంత యువతకు ఉపాధి గాని, వ్యవసాయ అభివృద్ధికి గాని మంత్రులు ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని కుటుంబం ఆమదాలవలసలో రూ.కోట్ల విలువైన భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, శ్రీకాకుళం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, విశాఖ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి బి.దొరబాబులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్

నాటిక పోటీలకు విద్యార్థుల ఎంపిక

నందిగాం : మండలంలోని లగదాస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి నాటిక పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజేతలను అభినందించారు. అలాగే వమరవెల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య, డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గార ప్రగడలమ్మ అభినందించారు.

కోటబొమ్మాళి: జాతీయ నాటిక పోటీల్లో భాగంగా గార మండలం వమరవల్లి డైట్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన నాటిక పోటీల్లో కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు గెలుపొంది రాష్ట్ర నాటిక పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.సోమేశ్వరరావు తెలిపారు. తమ పిల్లలు ప్లాస్టిక్ మోనస్టార్ 2.0 అనే అంగ్ల భాషా నాటిక గ్లోవింగ్ ఆఫ్ హెల్త్ అనే తీమ్‌లో ద్వారా ఎంపికయ్యారని, వీరు ఈ నెల చివరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడా ఎంపికైతే ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. ఈ నాటికలో 9వ తరగతి విద్యార్థులు పూర్ణచంద్రరావు, లావణ్య, స్రవంతి, చరణ్, సతీష్‌లు పాత్రదారులు నటించారని చెప్పారు. ఈ మేరకు ఉపాధ్యాయులు అభినందించారు.



మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

మెరుగైన వైద్య సేవలకు కృషి

ప్రజాశక్తి- నందిగాం

గ్రామీణ ప్రాంతాల్లో పేదవాడికి పూర్తిస్థాయి వైద్య సేవలు అందజేయాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని నౌగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పి.అంజలి అధ్యక్షతన మంగళ వారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను వైద్య సిబ్బంది నెరవేర్చి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. జనవరి నుంచి ప్రతి మండలంలో నెలకు నాలుగు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలు కల్పనపై కమిటీ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి బార్నాన బాలకృష్ణ, అంబోడి విష్ణు, తమిరి దేవేంద్రరావు సిహెచ్ఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి నవీన్

ఆస్రా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఆస్రా మరింత కృషి చేయాలని జెసి ఎం.నవీన్ పిలుపునిచ్చారు. అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్నెస్ సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 24న న్యూఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి సదస్సు పోస్టరును తన ఛారంబరులో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు గంజి ఎజ్రా, ఉపాధ్యక్షులు జి.ఇందిరాప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, న్యాయవాదులు, కె.పి.సారధి, లఖినేని రవికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఆటల పోటీలు 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, వ్యాయమ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు 8న బాలురుకు, 9న బాలికలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జూనియర్, సీనియర్ విభాగాలుగా నిర్వహిస్తామని అన్నారు. ఈ పోటీలు హెచ్ఎంస్ అసోసియేషన్, పీడీ, పిఇటి అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నామని తెలిపారు.



వర్క్ పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పలరాజు

పాఠశాల పరిశీలన

కోటబొమ్మాళి: ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనలో అభ్యాసన సామగ్రిని ఉపయోగించాలని ఎంఇఒ సంపతిరావు అప్పలరాజు అన్నారు. మండలంలోని కమలనాభపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్క్‌బుక్స్‌లో విద్యార్థులు తప్పులుగా రాస్తే వాటిని సరిద్దాలని అన్నారు. స్మార్ట్ టివి ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలని ప్రధానోపాధ్యాయులు ఆనందరావుకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఆహార పదార్థాలు రుచిగా తయారు చేయాలని వంట కార్మికులకు సూచించారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భవాని, మీనా, రవిలు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సరోజిని, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. గత నెల అక్టోబరులో ఆర్మ్సాలేజ్ వేదికగా జరిగిన జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలికల విభాగానికికి ఎంపికయ్యారని అన్నారు. వీరు ఈ నెల 9 నుంచి 11 వరకు చిత్తూరు జిల్లా బంగారుపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

టెక్కలి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 నెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు టెక్కలి బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కూన జ్యోత్స్న ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు బి ఆదిశేషుని అభినందించారు.



టెక్కలి : అభినందిస్తున్న ఉపాధ్యాయులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

కొత్తూరు : ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యం ఎంచుకోని ఆ లక్ష్యానికి చేరుకోవాలని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల డైరెక్టర్ గేదెల కృష్ణారావు అన్నారు. శ్రీవెంకటేశ్వర ప్రయివేటు డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, తల్లితండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కరస్పాండెంట్ సుధారాణి మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, సినీ గీతాలకు నృత్యాలు చేశారు.

పాలస్తీనా దాడులను ఖండించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

పాలస్తీనా భాగమైన గాజా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న జాతినిర్మూలన దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి కాల్పుల విరమణ తీర్మానం ఓటింగ్‌లో బిజెపి మోడి సర్కార్ గైర్హాజరు కావడం సిగ్గుచేటన్నారు. పాలస్తిన ప్రజలకు సంఘీభావం తమ సంఘీభావం స్వాతంత్ర్య పాలస్తీన దేశ ఏర్పాటే శాశ్వత పరిష్కారమని అన్నారు. గాజా పౌర ఆవాసాలపై బాంబుల దాడులను ఇజ్రాయిల్ మొదలపెట్టి నెలరోజులు కావస్తుందని, పాలస్తిన ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో బి.శ్రీనివాస్, కామేష్, అప్పారావు, పి.నాగేశ్వరరావు, యుగంధర్, కోటేశ్వరరావు, రామకృష్ణ, దున్ను శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

శాస్త్రవేత్తల పరిశీలన

సోంపేట : మండలంలోని పలాసపురం పంచాయతీ పరిధిలో ఉన్న వరి పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. రాగోలు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఉదయ్ కుమార్, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పంటలు ఎండిపోయిన నేపథ్యంలో వర్షాలు కురిసి పదును పెరిగితే ఆ పొలాల్లో పెసర, మినుము, కట్టు జనుము వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జీవిత, రైతులు, పాల్గొన్నారు.

52 మంది రక్తదానం

కోటబొమ్మాళి: రక్తదానం చేసి మరొకరి ప్రాణదాతలు కావాలని స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. స్థానిక సత్యసాయి మందిరంలో జిల్లా సత్యసాయి కన్వీనర్ లింగరాజు పర్యవేక్షణలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన మంగళ వారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 52 మంది పాల్గొన్ని రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి చైతన్య, సత్యసాయి సేవా ప్రతినిధులు అనాథగుప్త, ఎస్.రాజశేఖర్, సాయి పాల్గొన్నారు.

పంటల నష్టాన్ని నివేదిస్తాం

మెళియాపుట్టి: మండలంలో ప్రస్తుతం ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు వల్ల పలు గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోయాయని, పంట నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు, తహశీల్దార్ సరోజినీ, మండల ఎఒ దానకర్ణుడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని సుందరాడ, చింతపల్లి, కూర్మన్నపేట, ముకుందాపురం, పద్మ గ్రామాల్లో మంగళవారం ఎండిన వరి పొలాలను పరిశీలించారు. రైతులను వరి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో సుమారుగా నాలుగు వేల ఎకరాల వరకు పంట నష్టం ఉన్నట్లు ప్రాథమిక అంచనాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మజ్జి రామచంద్ర, మజ్జి ధర్మారావు, భాస్కరరావు, సర్పంచ్ ప్రతినిధి శ్రీధర్, తేజారావు, శ్రీను, విఆర్ఒ శ్యామ్యూల్, లలిత, విఎఎలు పుష్ప, ఝాన్సీ పాల్గొన్నారు.



ఎండిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

కవిటి: వర్షాలు లేక నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పంటలు ఎండిపోయాయని, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు దయనీయస్థితిలో ఉన్నారని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు రైతుల పరిస్థితి గుర్తించి నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. మంగళవారం ఎండిపోయిన వరిచేలు పరిశీలించిన అనంతరం స్థానిక తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జన సైనికులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ దుర్గారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని సుంకర జగన్నాథంపురంలో ఎండిపోయిన పంట పొలాలను ఆ ప్రాంత రైతులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్.జె.పురం సర్పంచ్ ప్రతినిధి అఖిల్, లావేటి సురేష్, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న రాజేష్



శిక్షణ ఇస్తున్న సంజీవరావు

గ్రామీణ యువతకు శిక్షణ

కొత్తూరు : స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, మెళియపుట్టి మండలాలకు చెందిన 40 మంది యువకులు పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్ బి.సంజీవరావు మాట్లాడుతూ వెలుగు అసోసియేషన్ శాశ్వతంగా ఉంటుందని, ప్రభుత్వ పథకాలు యువత తెలుసుకొని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు కష్టాలో ఉన్న సమయంలో ఆదుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కె.దాస్‌నాయుడు, ఎ.చిరంజీవిరావు పాల్గొన్నారు.

నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని స్వయంప్రతిపత్తి ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాలలో 2021-2022 విద్యా సంవత్సరం నాల్గో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మంగళవారం విడుదల చేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బిఎలో 81.25,. బిఎస్‌సిలో 63.67, బికాం (జనరల్)లో 93.62, బికాం (ఒకేషనల్) 93.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, విద్యాబోధనలో శ్రద్ధ చూపిన అధ్యాపకులున అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.ఎస్.కనకదుర్గ పి.ప్రశాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస : ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) సూచించారు. మండలంలోని శ్రీనివాసచార్యులపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. స్వయంశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావా దేవీలు, పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలానా బ్యాంకు నుంచి ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. సిసి సుభద్ర, విఒఎ సుశీల, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థం

పలాస: బాల్య వివాహాలను అరికట్టాలని బ్రెడ్స్ కో-ఆర్డినేటర్ నర్మదా అన్నారు. మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పరిధిలో బ్రెడ్స్ కెఎస్‌సిఎఫ్ కైలాస్ సత్యార్థి చంద్రన్ ఫౌండేషన్, గ్రీన్ ఆర్మీ సంయుక్తంగా బాల్యవివాహాలపై, లైంగిక వేధింపుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు జరగకూడదని, వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాలకార్మికులు, లైంగిక వేధింపులు గురైతే 1098 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మెరుగైన సమాజం కోసం మీ అందరూ చట్టానికి లోబడి మెసులుకోవాలని కోరారు. డెక్టర్ ప్రశాంతి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు గోపాల్, శ్యామలాదేవి పాల్గొన్నారు.

'ఎంజిఆర్' పరామర్శ

పాతపట్నం : మండలంలోని లాభర, తీమర, గంగుపేట, పాతపట్నం బ్రాహ్మణ వీధి, హిరమండలం కల్లటలో మృతి చెందిన కుటుంబ సభ్యులను టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు మంగళవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



పరామర్శిస్తున్న గోవిందరావు

రేషన్ కార్డుల పంపిణీ

కవిటి: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు దూగానపుట్టుగ సర్పంచ్ డి భద్రాచలం తెలిపారు. కొత్తగా మంజూరైన రైస్ కార్డులను మంగళవారం సర్పంచ్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పంచాయతీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ రైస్ కార్డులూ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.